# Condolence Meeting on the demise of Prof. P.V.Arunachalam at Dravidian University

## ద్రావిడ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక వీసీ ఆచార్య పి.వి.అరుణాచలంకు ఘన నివాళి

తేది: 14.08.2020

ద్రావిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్-ఛాన్సలర్ ఆచార్య పి.వి.అరుణాచలం గారు గురువారం సాయంత్రం తనువుచాలించడంతో శుక్రవారం వర్శిటీ ఇన్‌చార్జ్ వైస్-ఛాన్సలర్ ఆచార్య టి.అనురాధ, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సుశీల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య టి.అనురాధ మాట్లాడుతూ... ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రాజెక్టు నుంచి విశ్వవిద్యాలయంగా అవతరించిన తరువాత ఆచార్య పి.వి.అరుణాచలం గారు మొట్టమొదట ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారని అన్నారు. కుప్పం పట్టణంలోని క్యాంప్ కార్యాలయం నుంచి పరిపాలన సాగిస్తూ ఇక్కడి రైతుల నుంచి భూముల సేకరణ, వివిధ భవనాల నిర్మాణం మరియు చెట్లను నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టి ఇప్పుడు మనం చూస్తున్న ఇంత మంచి వాతావరణానికి ఆయనే పునాది వేశారన్నారు. ఆచార్య పి.వి.అరుణాచలం గారు గణితంలో ఆచార్యులైనప్పటికీ తెలుగు సాహిత్యంపై మంచి పట్టు వుందని అన్నారు. ఈయన ఇంటర్మీడియట్ మ్యాథమ్యాటిక్స్ పాఠ్యపుస్తకాలు రచించినట్లు తెలిపారు. తాను ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్‌గా నియమితులైనప్పుడు ఆయన ఫోన్ ద్వారా అభినందనలు తెలియజేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పలు సూచనలు చేశారని తెలిపారు. ఆయన మృతి వర్శిటీకి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన మృతిపట్ల వర్శిటీ మాజీ ద్రావిడ విశ్వవిద్యాఖలఅయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య సత్యనారాయణ గారు, ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి గారు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు.

వర్శిటీ ఇన్‌చార్జ్ ఆచార్య ఎన్.సుశీల మాట్లాడుతూ... విశ్వవిద్యాలయంలో మొట్టమొదటగా తులనాత్మక ద్రావిడ సాహిత్య మరియు తత్త్వశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ రెండు విభాగాలను ఆచార్య పి.వి.అరుణాచలం గారు ప్రారంభించడం జరిగిందన్నారు. మొదటి వైస్‌ఛాన్సలర్‌గా ఆయన విద్యార్థులకు నేరుగా పాఠాలను సైతం చెప్పేవారని గుర్తు చేశారు. ఆయన మరణం కలచి వేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

అనంతరం డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య డి.శ్రీనివాసకుమార్, ఆచార్య శ్రీదేవి, ఆచార్య మస్తాన్, ఆచార్య అక్కుటర్‌బాబు, డా.ఎస్.హేమలత, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్.మాధవనాయుడు, వర్శిటీ ఇంజనీర్ జె.భాస్కర్, ఎస్టేట్ ఆఫీసర్ రఘుపతి, సూపరింటెండెంట్ ఆర్ముగం తదితరులు ఆచార్య పి.వి.అరుణాచలం గారితో ఉన్న అనుబంధాలను గుర్తు చేశారు. అదేవిధంగా ఆయన మృతి పట్ల రెండు నిముషాల పాటు బోధన, బోధనేతర సిబ్బంది మౌనం పాటించారు.

ఆచార్య పి.వి.అరుణాలం గారి మృతికి సంతాపంగా వర్శిటీకి శుక్రవారం సెలవు ప్రకటిస్తున్నట్లు వర్శిటీ ఇన్‌చార్జ్ వైస్-ఛాన్సలర్ ఆచార్య టి.అనురాధ గారు తెలిపారు.











